క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

సీతంపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ కార్యదర్శి పాపారావు అన్నారు. మండలంలోని కుడ్డపల్లి గ్రామంలో పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక రేపు

కురుపాం : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు ఉపాధి ఏపీఓ బావాజీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, 01/04/23 నుంచి 30/03/2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన వివిధ రకాల అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ బృందం చేపట్టి సామాజిక తనిఖీపై ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు. ఉదయం పది గంటలకు జరగనున్న కార్యక్రమానికి మండల పరిధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

శాకంబరిగా కోటదుర్గమ్మ



పాలకొండ : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మవారు శాకంబరీ దేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. అమ్మవారికి మహిళలు పసుపుకుంకుమలు సమర్పించి పూజలు చేశారు.

పెరిగిన వంశధార'



వంశధార నదిలో పడవ ప్రయాణం

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దుగా ప్రవహిస్తున్న వంశధార నదిలో గురువారం కాస్త వరద నీటి ప్రవాహం పెరిగింది. కాలిబాటలో రాకపోకలు నిలిచిపోయాయి. పడవ ప్రయాణం ఆరంభమైంది. ఒడిశాలో కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహం పెరినట్టు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

రెగ్యులర్ కమిషనర్‌ను నియమించండి

సాలూరు: సాలూరు మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిదిలో సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, రైతు బజారును వినియోగంలోకి తీసుకురాకపోవడం, పెట్రోల్, డీజిల్ బిల్లుల చెల్లింపులు పూర్తిగా ఇవ్వక మున్సిపాలిటీలో పారిశుధ్య పనుల సమస్యలు తదితర అనేక ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, స్త్రీ శిశు సంక్షేమ,గిరిజన సంక్షేమశాఖామంత్రి సంధ్యారాణిలు స్పందించి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని కోరారు.

27వ వార్డులో గ్యాంగ్ వర్క్స్

పార్వతీపురంటౌన్: పట్టణంలోని 27వ వార్డులో గురువారం గ్యాంగ్ వర్క్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 15 సచివాలయాలను మూడు యూనిట్లుగా విడదీసి 30 వార్డుల పరిధిలో ప్రతి రోజు మధ్యాహ్నం మూడు సచివాలయ వార్డుల్లో శానిటేషన్ వర్కర్లతో గ్యాంగ్‌వర్క్స్‌ను ప్రారంభించామని చెప్పారు. పారిశుధ్య పనులు, యాంటీ లార్వా స్ప్రేయింగ్, గార్బేజ్ రిమూవల్ తదితర పనులను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్, ఎమినిటి, ప్లానింగ్ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ సమస్యలు పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యుడు వల్లిరెడ్డి జగదీష్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ, వర్షపు నీరు మళ్లింపు వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు నడుతున్నారని తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల సమస్య పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఆర్‌పీ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి..



పాలకొండ రూరల్: హెల్మెట్ ధరించి వాహన ర్యాలీ చేపడుతున్న, న్యాయమూర్తి, పోలీసులు, యువత



కురుపాం : మండల కేంద్రంలోని ర్యాలీ నిర్వహిస్తున్న కోర్టు సిబ్బంది, పోలీసులు

• న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: వాహన చోదకులు బాధ్యతగా వ్యవహరించాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. మండల న్యాయ సలహా మండలి నేతృత్వంలో హెల్మెట్ వాడకం, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యాయస్థానం నుంచి కోటదుర్గమ్మ దేవస్థానం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారికి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. తప్పనిసరిగా రహదారి భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. ర్యాలీలో న్యాయవాదులు, పోలీసులు, వాహన చోదకులు, యువకులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

కురుపాం: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవా సంస్థ సభ్యులు, పారాలీగల్ వలంటీర్లు అంధవరపు కోటేశ్వరరావు, న్యాయవాది బరాటం చంద్రమౌళి, ఎన్‌జీఓ సభ్యులు షేక్ గౌస్, లోక్ అదాలత్ సభ్యుడు వెంకటరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ అథారిటీ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకు సాగింది. ర్యాలీలో ఏఎస్సై రమణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు .

రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారు...

• మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



వీరఘట్టం : రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నెల రోజుల పాలనలో రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చేసిందని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. వండవలోని తన స్వగృహంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను అత్యంత కిరాతకంగా హత్య చేశారన్నారు. అలాగే చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి చేశారని తెలిపారు. నెల రోజుల వ్యవధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్నో దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరుతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రస్తుత పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాలకొండ నియోజకవర్గంలో భూకబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. వాస్తవానికి 2014 – 19 మధ్య కాలంలో టీడీపీ పాలనలో (జయకృష్ణ అప్పుడు టీడీపీలో ఉన్నారు) జరిగిన అక్రమాలు ప్రజలందరికీ తెలుసునన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశామని తెలిపారు. టీడీపీ సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసగించిందని ఆరోపించారు. తల్లికి వందనం పేరిట ఇంటిలో ఎంతమంది చదువుకున్న పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి, ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు. మహిళకు ఉచిత బస్సు ప్రయాణం.. ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను గాలికొదిలి.. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు దిగడం దుర్మార్గమన్నారు. ఇప్పటికై నా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటం చేయక తప్పదన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం

• ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: జనసేన పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు ఎంతో కీలకమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని ఎం.రాజపురంలో ఆయన స్వగృహం వద్ద గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు జనవాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు సభ్యత్వ నమోదుపై జనసైనికులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ్‌భాస్కర్, మత్స పుండరీకం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుదత్త హోమం



గురుదత్త హోమంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం జై గురుదత్త హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో హోమం చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గరుగుబిల్లి, పెద్దూరు, హిక్కింవలస, రావుపల్లి, కొత్తపల్లి, తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జల్‌జీవన్ పనులు పూర్తయ్యేదెప్పుడు...?

సీతంపేట: జల్‌జీవన్ మిషన్ పనులు పాలకొండ నియోజకవర్గంలో కుంటుపడ్డాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 2024 నాటికి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామన్న బీజేపీ ప్రభుత్వం ఆచరణలో చూపలేకపోయిందన్నారు. ఇంతవరకు 40 శాతం పనులు కూడా జరగలేదనిన తెలిపారు. తాగునీటి సదుపాయం లేక గిరిజనులు గెడ్డనీరు తాగి రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజనులకు పూర్తిస్థాయిలో నీరు అందించాలని కోరారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగయ్యేలా పనులు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. పట్టణ పరిధిలోని శివారు ప్రాంతాల్లో సీఐటీయూ నాయకులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బుట్టిమఠం కాలనీలో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగర పంచాయతీ పరిధిలో ఎక్కడికక్కడే చెత్తాచెదారాలు పేరుకుపోయాయన్నారు. మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.

బాకీ అడిగినందుకు వ్యక్తిపై దాడి

పార్వతీపురంటౌన్: తనకు చెల్లించాల్సిన బాకీ అడిగినందుకు పట్టణంలోని రాయగడ రోడ్డు మెయిన్ రోడ్డులో నివాసం ఉంటున్న కిరాణా వ్యాపారి కింతలి వైకుంఠరావుపై దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. వైకుంఠరావు కన్యకా పరమేశ్వరి ఆలయంలో వివాహ కార్యక్రమాలకు సప్లయర్స్, లైటింగ్ కాంట్రాక్ట్ 2024 జనవరి నుంచి 2 సంవత్సరాలు లీజుకు తీసుకున్నాడు. గరుగుబిల్లి మండలం గొట్టివలస గ్రామానికి చెందిన వారణాసి గురునాథం తన కుమారుడి పెళ్లికి మార్చి నెల 16వ తేదీకి సంబంధించి లైటింగ్, సప్లయర్స్ రూ.55వేలకు అద్దెకు తీసుకుని అడ్వాన్స్ కింద రూ.2వేలు ఇచ్చాడు. పెళ్లయి నాలుగు నెలలైందని బాకీ చెల్లించాలని వైకుంఠరావు ఎన్నిసార్లు అడిగినా గురునాథం ఇవ్వలేదు. ఈ విషయాన్ని కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీకి వైకుంఠరావు తెలపడంతో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బరాటం వెంకటరమణ మూర్తి, కెంగువ రాజు దేవస్థానం కార్యాలయంలో ఇద్దరినీ సమావేశపర్చారు. ఆ సమయంలో ఇద్దరూ గొడవ పడడంతో ఆలయ పెద్దలు గమనించి వైకుంఠరావు, గురునాథాలను కార్యాలయం గది లోపల ఉంచి తలుపులు వేశారు. ఈ క్రమంలో గురునాథంతో వచ్చిన వ్యక్తులు గది తలుపులు కాళ్లతో తన్ని విరగ్గొట్టి లోపలికి వచ్చి వైకుంఠరావుపై చేతితో పిడిగుద్దులు గుద్ది తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటనలో వైకుంఠరావుకు కవుకు దెబ్బలు తగిలి తీవ్రమైన నొప్పి కలగడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

• ఎంపీపీ రామారావు



గరుగుబిల్లి: మరుపెంటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ ఉరిటి రామారావు, తదితరులు

గరుగుబిల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని మరుపెంట గ్రామంలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా మురుగు నిల్వలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.బలరామ్‌నాయుడు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే రావివలసలో నిర్వహించిన పారిశుధ్య వారోత్సవాలలో ఎంపీటీసీ సభ్యుడు కె.భరత్‌కుమార్, తదితరులు పాల్గొనగా, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు పర్యవేక్షించారు.

పరిశుభ్రత పాటించాలి.

గుమ్మలక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించి రోగాలకు దూరంగా ఉండాలని ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. దేవానంద్ సూచించారు. మండలంలోని దిగువమండ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హైమావతి మాట్లాడుతూ, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

భామిని: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరం ఆరోగ్యంగా ఉంటామని ఈఓపీఆర్‌డీ కె. కృష్ణారావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ టింగ శాంతికుమారి అన్నారు. మండలంలోని బత్తిలిలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్ సారథ్యంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే బాలేరు నిర్వహించిన అవగాహన ర్యాలీలో కార్యదర్శి సత్యవతి, సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ పడాల కొండయ్య, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: దిగువ మండలో అవగాహన ర్యాలీ



భామిని: బాలేరు ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

• ఎంపీడీఓ రామకృష్ణ



తంపటాపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని తుంపటాపల్లిలో ఎంపీడీఓ గురువారం పర్యటించి, పారిశుధ్య పనులపై ఆరా తీశారు. అనంతరం ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి కమల్‌నాథ్ మాట్లాడుతూ, వర్షాలు పడుతున్నందున ప్రతి ఒక్కరూ వేడి ఆహార పదార్థాలు తినాలని సూచించారు. అలాగే కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వివరించారు.

ప్రతి గిరిజన గ్రామానికీ రహదారి

• ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



సీతంపేట గ్రామానికి వెళ్లే రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం: ప్రతి గిరిజన గ్రామానికీ రహదారి మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 70 లక్షలతో మండలంలోని సీతంపేట గ్రామానికి బీటీ రహదారి, గుమ్మ పంచాయతీలోని కొనగూడ గ్రామానికి కోటీ 20 లక్షలతో నిర్మించిన బీటీ రహదారులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రహదారుల ఏర్పాటుతో ఆయా గ్రామాల గిరిజనుల కష్టాలు తీరాయని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, మండల కన్వీనర్ కొండయ్య, కోలా రంజిత్, చందక రామకృష్ణ, సుకేష్ పండా, ఎంపీడీఓ, ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు .

నవధాన్యాలతో భూమికి సారం



నవధాన్యాల పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ అన్నపూర్ణ,సిబ్బంది

జియ్యమ్మవలస: నవధాన్యాల సాగుతో భూసారి పెరుగుతుందని ఎస్ఎఫ్ఏ జి. అన్నపూర్ణ అన్నారు. మండలంలోని పరజపాడు గ్రామంలో రైతు ఎం. అచ్యుత సాగుచేస్తున్న నవధాన్యాల సాగును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా 5/5 విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేపట్టగా 30 కేజీల 950 గ్రాముల దిగుబడి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎకరాకు ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా 20 నుంచి 30 రకాల విత్తనాలైన నవధాన్యాలను సాగుచేసి 40 రోజుల్లో కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది స్వామినాయుడు, బి. ధనుంజయరావు, జి. త్రినాథ, రైతులు పాల్గొన్నారు.

గుణాత్మక బోధన అవసరం

• ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ సోంబాబు

పాలకొండ రూరల్: విద్యార్థులపై ఎటువంటి మానసిక ఒత్తిడి పడకుండా గుణాత్మక బోధన అందించాలని ఉప విద్యాశాఖాధికారి పి. కృష్ణమూర్తి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్ పేరిట తొమ్మిది రోజులు నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాటాడ్లడుతూ, విద్యార్థుల అభ్యసనా స్థాయిని అంచనా వేసి బోధన చేపట్టినప్పుడే ఉపాధ్యాయుడి వృత్తి నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. తరగతి గదిలో గుణాత్మక విద్య అందించడంతో పాటు లక్ష్యాలను అనుగుణంగా బోధించేందుకు టీచ్ టూల్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎంఈఓ కె. సోంబాబు మాట్లాడుతూ, సమగ్రశిక్ష , రాష్ట్ర విద్యా పరిశోధన మండలి సంయుక్తంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాయని చెప్పారు.

శిథిలావస్థలో కోటిపాం వంతెన



శిథిలావస్థకు చేరుకున్న వంతెన

కొమరాడ : పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై మూడో రైల్వేగేట్ దాటిన వెంటనే జంఝావతి నదిపై 1933లో బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన వంతెన (కోటిపాం వంతెన) శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారిపై మూడు రాష్ట్రాలకు చెందిన భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం వంతెన మధ్యలో గోతులేర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి, తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతంపేట/భామిని: విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో సీతంపేట, భామిని ఏఈలు నీలిమ, శ్రీనివాస్ గురువారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు రెండు మండలాల్లోనూ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు

• ఎమ్మెల్యే జగదీశ్వరి



కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం : రిటైల్ షాపుల వద్ద సరసమైన ధరలకే నాణ్యమైన కందిపప్పు, బియ్యం లభ్యమవుతున్నాయని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద పౌరసరఫరాల శాఖ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రిటైల్ షాపును గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెరిగిపోయిన నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు ప్రభుత్వం రిటైల్ షాపులను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ షాపుల్లో మార్కెట్ ధరల కంటే తక్కువకే కందిపప్పు, బియ్యం లభిస్తాయని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, టీడీపీ నాయకులు పాడి సుదర్శనరావు, డొంకాడ రామకృష్ణ, కడ్రక కళావతి, తదితరులతో పాటు జియ్యమ్మవలస ఎంపీపీ బొంగు సురేష్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com